సోలార్.. సూపర్!



మండలంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్స్

- పీఎం సూర్య ఘర్ పథకానికి ఆదరణ
- సబ్సిడీతో పాటు రుణసదుపాయం
- ఆసక్తి చూపిస్తున్న వినియోగదారులు



ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్స్

పెదగంట్యాడ: సోలార్ పవర్.. సూపర్ అంటున్నారు వినియోగదారులు. సహజ వనరుల్లో థర్మల్ పవర్, విండ్ పవర్ ఇలా ఎన్ని ఉన్నా సోలార్ వైపే మొగ్గు చూపుతున్నారు. సహజ వనరులను సద్వినియోగం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకానికి వినియోగదారుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది.

దరఖాస్తుల వెల్లువ

గాజువాక నియోజకవర్గం పరిధిలోని పెదగంట్యాడ మండలంలో ఇప్పటికే 360 వరకూ సోలార్ రూఫ్‌టాప్ కోసం దరఖాస్తులు అందినట్టు ఈపీడీసీఎల్ అధికారులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో పాటు రుణ సదుపాయం కల్పిస్తుండడంతో ఈపీడీసీఎల్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్‌తో నెలకు 160 యూనిట్లు, రెండు కిలోవాట్లకు 240 యూనిట్లు, మూడు కిలో వాట్లకు 360 యూనిట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. దీని ద్వారా గణనీయంగా విద్యుత్ బిల్లు ఆదా అవుతుందని అధికారులు చెబుతున్నారు.

సోలార్ రూఫ్‌టాప్ కోసం గాజువాక నియోజకవర్గం పరిధిలోని వికాస్‌నగర్, సమతానగర్, పెదగంట్యాడ, గాజువాక, కూర్మన్నపాలెం, అగనంపూడి, దువ్వాడ తదితర ప్రాంతాలకు చెందిన 360 మంది గృహ యజమానులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ మేరకు వారి దరఖాస్తులు పరిశీలించిన ఏపీఈపీడీసీఎల్ అధికారులు సోలార్ రూఫ్‌టాప్ పనులు చేపట్టారు.

ఈ పథకంలో చేరాలంటే..

ముందుగా పీఎం సూర్యఘర్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాలు నమోదు చేయాలి. ఆరు నెలల కరెంటు బిల్లు కాపీలు జతపర్చాలి. ఆపై రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అందులో కిలో వాట్ ప్రకారం సబ్సిడీ అందనుంది. మిగిలిన మొత్తానికి బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పించనున్నారు. వినియోగదారులు వారి తాలూకా బ్యాంక్ ఖాతా వివరాలు అప్‌లోడ్ చేయాలి. సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 30 రోజుల్లో చెల్లించనుంది. కిలో వాట్ రూఫ్‌టాప్ కెపాసిటీ కోసం 3 నుంచి నాలుగు ప్యానెల్స్ అమర్చనున్నారు. ఒక్కో కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్ నెలకు దాదాపు 160 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేయనుందని తెలుపుతున్నారు..

రాయితీ ఇలా..

సోలార్ వ్యవస్థ ద్వారా ఉత్పత్తి అయ్యే కిలో వాట్ ప్లాంట్‌కు రూ.30వేలు, రెండు కిలో వాట్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునే వారికి రూ.60వేలు, మూడు కిలో వాట్ల ప్లాంట్ ఏర్పాటు చేసుకునే వారికి రూ.78 వేలు గరిష్ట రాయితీ వర్తిస్తుందని. ఎవరికి ఎంత కెపాసిటీ కావాలంటే నెలకు 0–150 యూనిట్లు విద్యుత్ వినియోగించే వారికి ఒకటి నుంచి రెండు కిలో వాట్లు రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుంటే సరిపోతుంది. అలాగే 150 నుంచి 300 యూనిట్లు వినియోగించే వారు రెండు మూడు కిలో వాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంటు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



వినియోగదారులు సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే పథకం పీఎం సూర్య ఘర్ . సోలార్ విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీతో పాటు రుణ సదుపాయం అందిస్తోంది. వినియోగదారులు పెట్టిన పెట్టుబడి సుమారు ఏడేళ్లలో తిరిగి పొందవచ్చు. నెట్ మీటర్ విధానం ద్వారా విద్యుత్ వినియోగాన్ని తెలుసుకోవచ్చు. ఈ పథకానికి సంబంధించి సందేహాలు ఉంటే ఈపీడీసీఎల్ కార్యాలయాల్లో సంప్రదించవచ్చు. పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే ఈ పథకం గురించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

–టీకే నాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జోన్–2, ఏపీఈపీడీసీఎల్

క్లుప్తంగా

నేడు విశ్వకర్మ జయంతి

ఉక్కునగరం: విశ్వకర్మ జయంతి వేడుకలు మంగళవారం ఉక్కునగరంలో నిర్వహించనున్నారు. స్టీల్‌ప్లాంట్ ఏరియా విశ్వకర్మ డివోటీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మరిడి మాంబ ఆలయం సమీపంలోని విశ్వకర్మ ఆలయంలో ఉదయం 9.30గంటలకు పతాకావిష్కరణ, విగ్రహావిష్కరణ చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. వేడుకల్లో స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీ ఎ.కె. బాగ్చీ, డైరెక్టర్లు ఎస్.సి. పాండే, జి.వి.ఎన్. ప్రసాద్, గణేష్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. కరుణరాజు, ఉన్నతాధికారులు పాల్గొంటారు. మధ్యాహ్నం నిర్వహించే అన్నసమారాధనలో పాల్గొనాలని పూజా కమిటీ ప్రతినిధులు కోరారు.

చాకలి ఐలమ్మ సేవలకు గుర్తింపు



మాట్లాడుతున్న పొన్నాడ మోహనరావు

అగనంపూడి: తెలంగాణ ప్రభుత్వం చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని, సేవలను గుర్తించడం సంతోషంగా ఉందని ఉమ్మడి విశాఖ జిల్లా రజక సంఘం చైర్మన్ పొన్నాడ మోహనరావు, అధ్యక్షుడు తోకాడ రాము అన్నారు. జిల్లా రజక సంఘ సమావేశం సోమవారం అగనంపూడిలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని కోఠి మహిళా కళాశాలకు తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెడతామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. అలాగే ఆమె కుటుంబంలో మహిళను మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమిస్తామని ప్రకటించడం రజకుల పట్ల ముఖ్యమంత్రికి ఉన్న ప్రేమాభిమానాలు రుజువు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రజక సంఘం ప్రతినిధులు పాలమూరు గురునాథరావు, కసింకోట జైనాథ్, తోకాడ ఈశ్వరరావు, సీహెచ్.నాగరాజు, ఈశ్వరరావు పాల్గొన్నారు.


ఆకట్టుకుంటున్న గరిక వినాయకుడు



గరిక అలంకరణలో బాల వినాయకుడు

అక్కిరెడ్డిపాలెం: వినాయ ఉత్సవాలను బెల్ సిగ్నల్ పాయింట్ వద్ద ప్రసన్న గిరిపై గల శ్రీ వేంకటేశ్వర స్వామి, వినాయక స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం ప్రసన్నగిరి ప్రారంభంలోని బాల వినాయకుడిని గరికతో అలంకరించారు. పలువురు భక్తులు గరిక వినాయకుడిని దర్శించుకుని పులకించిపోయారు.

లడ్డూ @ రూ. 60 వేలు



గ్రీన్‌సిటీలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు కాపుజగ్గరాజుపేట దరి గ్రీన్ సిటీలో వినాయ చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం హోమం జరిపించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. తర్వాత లడ్డూ వేలం వేయగా దుర్గా ప్రసాదరావు అనే భక్తుడు రూ.60 వేలకు పాడుకున్నారు. కార్యక్రమంలో గ్రీన్‌సిటీ అసోసియేషన్ ప్రతినిధులు వి.వి.కృష్ణారావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, రవి, సందీప్, తన్మయ్, మైథిలి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఉక్కు ఉద్యోగుల విరాళం

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలవాలని నిర్ణయం



పోరాట కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఆదినారాయణ

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలవాలని నిర్ణయించారు. సోమవారం జరిగిన ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సమావేశంలో నాయకులు పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ ద్వారా పవన్ కల్యాణ్ అపాయింట్‌మెంట్ తీసుకోవాలని నిర్ణయించారు. ఇటీవల వరదలతో అతలాకుతలమైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ రాష్ట్రాలకు ఉక్కు ఉద్యోగులు హాఫ్ డే జీతాన్ని విరాళంగా ఇవ్వాలని అంగీకరించారు. వీలైనంత త్వరలో యాజమాన్యాన్ని కలిసి ఢిల్లీలో ఇటీవల జరిగిన పరిణామాలు, పీఎఫ్ బకాయి, త్రిఫ్ట్ బకాయి, ఎస్‌ఏబీఎఫ్‌లను అడగాలని తీర్మానించారు. సమావేశంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కె.ఎస్.ఎన్.రావు, అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, జి.గణపతిరెడ్డి, రామ్మోహన్‌కుమార్, కామేష్, వరసాల శ్రీనివాసరావు, శ్రీనివాసనాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం



రామ అప్పారావును సత్కరిస్తున్న పెదమడక సంపత్ వినాయక ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన హక్కుల సాధన, ఆర్థిక ప్రయోజనాలను కాపాడడంలో సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు చూపుతున్న చొరవ అభినందనీయమని పలువురు కొనియాడారు. ఆయన సేవలను అభినందిస్తూ సంపత్ వినాయక ఆలయ కమిటీ ప్రతినిధి మోటూరి వెంకటరమణ, అగనంపూడి వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు మడగల నరసింగరావు, సీడబ్ల్యూసీ మాజీ కార్యదర్శి వంకర రాము సత్కరించారు. కార్యక్రమంలో సోమునాయుడు, బేతా హనుమంతురావు, మజ్జి శ్రీను పాల్గొన్నారు.

ముగిసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు



మహాపూర్ణాహుతిలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు



స్వామి వారిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులోని సంకట మోచన గణపతి ఆలయంలో ఈ నెల7 నుంచి నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలను పురస్కరించుకొని నిర్వహించిన మహాపూర్ణాహుతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, రాజాన రామారావు, బొడ్డు నరసింహపాత్రుడు, పల్లా శ్రీను హాజరయ్యారు. సంకటమోచన గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తిని మేళతాళాలు,మంగళ వాయిద్యాల మధ్య పురవీధుల్లో ఊరేగించి పల్లకీ సేవ నిర్వహించారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన పెంపొందిస్తున్నారని చెప్పారు. ఆలయ ధర్మకర్త మంత్రి రాజశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మంత్రి నర్సింహమూర్తి, మంత్రి శంకరనారాయణ ఆధ్వర్యంలో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కులుకూరి మంగరాజు, గేదెల మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోతిన సేవలు మరువలేం



పోతిన సన్యాసిరావు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: మాజీ ఎమ్మెల్యే పోతిన సన్యాసిరావు సేవలు మరువలేమని సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక పోతిన సన్యాసిరావు భవనంలో సన్యాసిరావు వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ



ఇస్లాంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

పెదగంట్యాడ: మహ్మద్ ప్రవక్త కోరుకున్న సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ముస్లిం పెద్దలు ఎండీ దావూద్, ముస్తఫా, గఫార్, బాషా, అలీసా నన్నూ, ఎండీ తస్లీం అన్నారు. మహ్మద్ ప్రవక్త జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జీవీఎంసీ 77వ వార్డు ఇస్లాంపేట జామియా మసీదులో మిలాద్–ఉన్–నబీ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ముస్లింలంతా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇస్లాంపేట నుంచి చినపాలెం, పెదపాలెం, దేవాడ, నమ్మిదొడ్డి తదితర ప్రాంతాల మీదుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మౌలాల అలీ, అమంత్ రసూల్, షానీషా తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నర్సుల నిరసన ప్రదర్శన



కేజీహెచ్ ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు

మహారాణిపేట: జీవో 115ను రద్దు చేయాలని కోరుతూ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు చేస్తున్న ఆందోళన 11వ రోజుకు చేరుకుంది. కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట వారు సోమవారం కూడా నిరసన ప్రదర్శన చేపట్టారు. ఏపీ నర్సుల స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో గత పది రోజుల నుంచి వారు ఆందోళన చేస్తున్నారు. కాంట్రాక్టు నర్సులు జీఎన్ఎం, బీఎస్ నర్సింగ్, ఎంఎస్‌సీ నర్సింగ్ చదవి ఇప్పటికే ఎన్నో సంవత్సరాల అనుభవం ఉన్నవారు ఉన్నారని, తమను రెగ్యులర్ చేయకుండా ఇతరులకు పదోన్నతులు కల్పించవద్దని నర్సులు డిమాండ్ చేశారు.

గంజాయితో యువకుడి అరెస్ట్

అల్లిపురం: గంజాయి కలిగి ఉన్న యువకుడిని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం పెదబయలు ప్రాంతానికి చెందిన బాల గంగాధర్ తిలక్ (24) గంజాయి తీసుకొచ్చి పితానిదిబ్బలో విక్రయానికి ప్రయత్నిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి టూటౌన్ ఎస్ఐ శంకరరావు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 23 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎలాంటి పోరాటాలకైనా సిద్ధం



దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మికులు

అగనంపూడి: విశాఖ ఉక్కును పరిరక్షించుకోడానికి ఎలాంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నామని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో మంగళవారం చేపట్టిన 1313వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. దీర్ఘ కాలంగా ఆందోళనలు, ఉద్యమాలు, రాస్తారోకోలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వ పెద్దలు కనీసం చలించకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వంలో కదలిక తీసుకురావడానికి ఎలాంటి పోరాటాలకైనా, త్యాగాలకైనా సిద్ధమే అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు మసేన్‌రావు, డొక్కా నరసింగరావు, కె.రాజబాబు, సాంబశివరావు, జి.రాజు, డేవిడ్, సలాది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల పోరుబాట

రేపు ఈడీ బిల్డింగ్ వద్ద ధర్నా



ఐక్యత చాటుతున్న కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో పోరుబాట పట్టారు. అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఎల్ఎంఎం పార్కులో సమావేశమైన నాయకులు ఉద్యమంపై చర్చించారు. కాంట్రాక్ట్ కార్మికుల అటెండెన్స్ గేట్లు వద్ద ఉన్న బయోమెట్రిక్ మిషన్ల ద్వారా కాకుండా విభాగాల్లో హాజరు ఇవ్వాలని, జీతాల కోత విధించే నిర్ణయం ఉపసంహరించాలని, బయోమెట్రిక్ పేరిట ఏ కార్మికుడిని నిలుపుదల చేసినా అంగీకరించబోమన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల ఫైనల్ చెల్లింపులో కోత విధించరాదని, స్కిల్డ్ కార్మికులకు ఈఎస్ఐ బదులు ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి రవి, పిట్టారెడ్డి, పి. భాస్కరరావు, ఉరుకూటి అప్పారావు, ధర్మాల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూజలు .. అన్న సంతర్పణలు



వినాయకుడిని దర్శించుకుని పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అగనంపూడి: గణేష్ ఉత్సవాల సందర్భంగా 87వ వార్డు వడ్లపూడి, కణితి నిర్వాసిత కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో గణనాథులను మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. తర్వాత విశేష అన్న సమారాధన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 87వ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, పార్టీ గాజువాక అధ్యక్షుడు బొడ్డ గోవింద్, నాయకులు సారిపల్లి తాతారెడ్డి నర్సింగరావు, కరణం కనకారావు, సిరసపల్లి అప్పారావు, కరణంరెడ్డి రాము, సాలాపు నూకరాజు పాల్గొన్నారు.

పాతకర్ణవానిపాలెంలో..

గాజువాక: కేఎన్‌వీపీ యంగ్‌స్టర్స్ ఆధ్వర్యంలో పాతకర్ణవానిపాలెంలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. వేలాది మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు కరణం

క్లాప్ వాహనాల డ్రైవర్లు, లోడర్ల ధర్నా



ధర్నాలో పాల్గొన్న క్లాప్ వాహనాల డ్రైవర్లు, లోడర్లు

గాజువాక: క్లాప్ వాహనాల డ్రైవర్లు, లోడర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. జీతాల చెల్లింపులో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా క్లాప్ వాహనాలను యార్డు నుంచి బయటకు రాకుండా నిలిపివేశారు. ప్రతి కార్మికునికి నాలుగు నుంచి ఆరు నెలల జీతాలు పెండింగ్ ఉన్నాయని, ఇలా అయితే ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్‌లు చెల్లించడంలేదని, ప్రమాదం జరిగితే కార్మికుల విషయంలో కాంట్రాక్టరు సంబంధం లేకుండా వ్యవహరిస్తున్నారని వాపోయారు. దీనిపై ఏ ఒక్కరూ సమాధానం చెప్పడంలేదని కార్మికులు పేర్కొన్నారు. కాంట్రాక్టర్‌పై జీవీఎంసీ కమిషనర్ చర్యలు తీసుకోవాలని, అవసరమైన కాంట్రాక్టును రద్దు చేయాలని, జీతాలు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో తమ బంద్ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అనిల్, ఎల్లబిల్లి సుధీర్, జెక్కి లక్ష్మి, రాజు, ధనరాజు, వీర్రాజు, గొలగాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



పతకాల విజేతలతో కరాటే కోచ్‌లు డాక్టర్ రామారావు, సుమన్

ఉక్కునగరం: రాష్ట్ర ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించిన సృష్టి వరల్డ్ పాఠశాల విద్యార్థులను సోమవారం పాఠశాలలో అభినందించారు. కెంకో షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. పోటీల్లో సృష్టి వరల్డ్ విద్యార్థులు ధర్నేష్ కాటాలో స్వర్ణం, కుమిటేలో కాంస్యం పతకాలు గెలుపొందాడు. సంపన్‌కు కాటాలో బంగారు పతకం, జషికారు కాటాలో కాంస్యం, ఎం. దుర్గాప్రసాద్ కాటాలో బంగారం, కుమిటేలో రజత పతకం , బి. గణపతి కాటాలో రజత పతకం, కుమిటేలో కాంస్య పతకం, షేక్ సాజిద్ కుమిటేలో కాంస్య పతకం, దైవిక్ నారాయణ్ కాటాలో కాంస్య పతకం గెలుపొందారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సుశీలారాణి విజేతలతో కరాటే కోచ్‌లు డాక్టర్ ఎ.వి. రామారావు, సుమన్‌లను అభినందించారు.

